# చేసుకున్న వారికి చేసుకున్నంత



అవసరాల రామకృష్ణారావు

'దిక్కుమాలిన వర్షం సరదా అంతా చంపేసింది. సరిగ్గా ఇప్పుడే దిమ్మరించి చావాలా? ఈ వరలక్ష్మీ వ్రతం కోసం ఏటికేడాదీ ఎదురుచూస్తాం పునిస్త్రీలం. మన కేదో ప్రత్యేకించి ఒళ్లో పడుతుందనే స్వార్థబుద్ధితో కాదు గదా! ఇంత పసుపూ కుంకుమా నాలుగు పళ్లూ తెలిసిన నలుగురు ముత్తైదులకీ పంచుకుని వాయినాలు ఇచ్చుకుంటే ఇళ్లు పచ్చగా ఉంటాయి. ఏ యింటికి ఆ యిల్లు చల్లగా ఉంటే గదా దేశం మొత్తం బాగుపడేది! ఇంతకన్న మనం చేసే దేశసేవ అంటూ ఏముంటుంది! చూడబోతే పట్టుకున్న వానకి అంతూ దరీ లేనట్టుంది....' టెలిఫోన్‌లో అనూరాధ అదే పనిగా వాపోతోంది. అట్నుంచి రేవతి కంఠం ఖంగుమని వినిపించింది.

'మీరలా వర్రీ అయిపోతే ఎలా వదినగారూ! కళ్లు మూసుకుని ఆ దేవిని కొలుచుకుంటున్నాం గాని మనం ఎవరికీ అపకారం తలపెట్టలేదు కదా! ఇవాళ పొద్దుట మాత్రం వర్షం తక్కువ పడింది గనకనా! అయినా యథావిధిగా పూజాకార్యక్రమం నిర్వర్తించుకుని తొమ్మిది పిండివంటల నైవేద్యంతో ఏదో అయిందనిపించామా లేదా!'

'బాగుంది వదినా, శాస్త్రం ప్రకారం ఇరవై ఒకటి చేసుకోవాలి. దీనికే ఏదో తప్పుచేసినట్టు గిలగిల కొట్టుకుంటోంది మనసు. అందుకు కాదు. భారీవర్షం పడుతున్నా ఊరందర్నీ పేరంటానికి పిలిచాము. ముందు కార్యక్రమం ఏమిటీ అని!'

అదేదో ముచ్చటించుకునే అవకాశం వాళ్లకి ఆ పైన కలగలేదు. టెలిఫోను సంబంధాలు విచ్ఛిన్నమయాయి.

పాతిక పిలకలైనా ఓచోట చేరి కిలకిల లాడగలవు గాని రెండు కొప్పులు కలుసుకుంటే వేరే నిప్పు అక్కర్లేదని సామెత. డియ్యీవో గారి భార్య రేవతికీ, కలక్టరు గారి భార్య అనూరాధకీ ఈ సామెత వర్తించదు. ఏడాదిలో ఏదైనా నోము అయినా వ్రతం అయినా రానియ్యి ఆవిడగారు ఈవిడకో, ఈవిడగారు ఆవిడకో ఫోను చేస్తుంది. ఎవరింట్లో వాళ్లు పూజాదికాలు నిర్వర్తించుకున్నా పేరంటం మాత్రం సాధారణంగా ఏదో ఒకింట్లో జరుగుతూ ఉంటుంది. కలక్టరు గారి బంగళా కాస్త పెద్దదీ, ఓ వంద మంది పట్టే హాలు ఉన్నదీ కాబట్టి ఎక్కువగా అక్కడే ఇద్దరూ కలసి చేసుకుంటూ ఉంటారు. వీళ్లిద్దరి జంటనీ విడదీద్దామని తక్కిన అమ్మలక్కలు చేసిన ప్రయత్నాలు ముక్కముక్కలు అయాయి.

ఆ ఏడు శ్రావణ శుక్రవారం పేరంటం కోసం గత రెండురోజులూ ఇద్దరూ కలసి కలక్టరుగారి జీపు ఉపయోగించి ఊరంతా పిలిచారు. అనూరాధావాళ్ల మధ్యహాలు కొత్తగా కొన్న రంగురంగుల బల్బులతో దివ్యంగా అలంకరించబడింది ఓ రోజు ముందుగానే. ఎత్తుగా అమర్చిన వేదికమీద బంగారుపూత వరలక్ష్మి వెండి విగ్రహం సాయంకాలం ఆ హాలు నిండా కిటకిటలాడే కొత్తచీరల ముత్తైదువుల కోసం కన్నార్పకుండా ఎదురు చూస్తున్నట్టు ఉంది.

అసలు పేరంటాళ్లని పిలుపుల కోసం వెళ్లినప్పుడే హోరుహోరని వాన మొదలయింది. రోజురోజుకీ ఆ ఉధృతం పెరుగుతోందేగాని తరగడం లేదు. పేరుకి ఇద్దరూ ఇంటింటా పిలిచారుగాని, జీపు దిగి లోపలికివెళ్లి వచ్చేసరికే వాన ఓ మొత్తుమొత్తేసి తడిసి ముద్దయిపోయేవారు. తలా ఒళ్లూ పూర్తిగా తడిసిపోయినా ఆ లక్ష్మీకటాక్షంవల్ల ఇద్దర్లో ఎవరికీ తలనొప్పి, జలుబూ, జ్వరం రాలేదు. ఆ కాటికి నయమే. ఆ తల్లి తలుచుకోవాలిగాని తెల్లారేసరికి ఫెళ్లున ఎండకాయదా అని ఆశించారుగాని ఆ తల్లి తలుచుకోలేదు సరికదా.... మరింతగా వాన ఎక్కువై భూమీ ఆకాశం ఏకమైపోయినట్టు అనిపించింది.

ఎలాగో పగటి పూజ అయిందనిపించారు.

అంత ఉత్సాహంతో అన్ని ఏర్పాట్లూ

చేసుకుని ఊరూవాడా పిలుచుకుని ఇద్దరూ ఇక్కడే ఎంతో సంబరంతో చేసుకుందాం అనుకున్నారే, ఇదంతా వీరుకారి పోవలసిందేనా? అంతదాకా అనూరాధ ఫోనులో అయినా తన వేదన రేవతితో పంచుకునేది. ఇప్పుడు ఆ అవకాశంకూడా లేదు. తీగెలు తెగి పోయాయి. అంతేనా? కిటికీ దగ్గిర కుర్చీ వేయించుకుని, ఏనుగు తొండాలతో దిమ్మరిస్తున్నట్టు పడుతున్న వర్షపు ధారలని చూస్తూ, గంటలు గంటలు అలాగే గడుపుతున్న అనూరాధ చెవిలో పడుతున్న వార్తలు ఒకటా రెండా?

'అమ్మగారూ, ఇది విన్నారా? రామ కోవిల పక్క పల్లపువీధి లేదూ? పూర్తిగా మునిగిపోయిందట.'

'ఎప్పుడూ ఎండిపోయి ఉండే పీర్ల కోనేరు ఇప్పుడెలా ఉందనుకున్నారు? పెద్ద సముద్రంలా ఉంది. ఏ క్షణమైనా గండి పడిపోతుందేమో అని ఊరంతా బెంగపెట్టుకున్నారు....'

'పోస్టాఫీసు పక్క చింతచెట్టు వేళ్ళతోసహా పడిపోయింది. పక్కనున్న కల్లుపాక నేలమట్టమయింది. కనీసం ఓ పదిమందయినా చనిపోయారనుకుంటు న్నారు.'

'వరద ప్రమాదసూచకంగా రెండో హెచ్చరిక ఎగరేశారుట, మీరు గుర్తిం చారో లేదో.'

'రెండొందల కుటుంబాల్ని జూని యర్ కాలేజీకి తరలిస్తున్నారట.'

'నీటిచప్పుడుకన్న గాలి హోరుకన్న ఎక్కువగా ఉండిట వరద దెబ్బతిన్న మనుషుల గోల.'

'ఇంచుమించు రెండువందల ఎకరాల వరిపంట నాశనం అయినట్టే.'

'యాత్రికుల పడవ బోల్తాపడి యాభైయిద్దరు కొట్టుకుపోయారు.'

'ఎవరెక్కడ చిక్కుకుపోయారో తెలియక ఇంటికిరాని బంధువులకోసం ఏ యింట్లో చూసినా ఆక్రందనలు.'

'ఇంకా మనూరు నయమే, అల్లె దెక్కడో నీటిమధ్య చిక్కుకుపోయిన ఓ గ్రామానికి వరసగా రెండోరోజున కూడా హెలికాప్టర్ల ద్వారా ఆహార పొట్లా లను అందిస్తున్నారట.'

నౌకర్లు చెప్పిన కబుర్లూ, ట్రాన్సి స్టర్లు చేరవేసిన వార్తలూ అనూరాధ చెవిలో పడ్డాయి గాని ఏమాత్రం చలింప చేయలేకపోయాయి. అవిడ నమ్మకాలు ఆవిడవి. తక్కువ నోములు నోచు కుంటే ఎక్కువ ఫలితాలు వస్తాయా? పుణ్యం చేసుకుంటే దైవం రక్షించక పోడు. ఏ ఆపదలు వాటిల్లినా పాపాత్ములకే.

'గజపతి నగరాలు' ఏం వచ్చినా కట్టుదిట్టంగానే ఉంటాయి.

'బడుగువాని లంకలు' ఎప్పుడూ మునిగిపోతూనే ఉంటాయి. దైవనిర్ణయం ప్రకృతిధర్మం ద్వారా ప్రకటితమౌతూ ఉంటుంది. ఊరంతా తడిసి తల్లడిల్లి పోతోంది. ఒక్క చినుకు తనమీద పడలేదంటే ఎప్పుడు బంగారు పువ్వుల పూజ చేసిందో? పగలే చీకటై కరెంటు లేక అంధకార బంధురమై ఉంది, పక్క నున్న పెట్రొమాక్సు లైటులా తను వెలిగిపోతోందంటే ఏ జన్మలో ఏఏ పుణ్యవ్రతాలు ఆచరించిందో? అలాంటి విశ్వాసాలు టీకాలు మచ్చలంత స్పష్టంగా తనలో నాటుకుని ఉన్నాయి. ఆవిణ్ణి కలవరపెట్టే ఒకే ఒక విషయం ఈరోజు తను తలపెట్టిన యీ వ్రతం ఎలా పూర్తవుతుందా అని. మొదలు పెట్టకూడదే గాని మొదలయాక ఈ పుణ్యకార్యానికి విఘ్నం కలగడానికి వీల్లేదే. తెలిసీ తెలియకుండా తనవల్ల ఏ అపరాధం జరిగిందో? లేకపోతే ఆ దయగల తల్లి తనకి ఇంత పరీక్ష పెడుతుందా?

వంటమనిషి ఇచ్చిన కాఫీ తాగి అనూ రాధ తల పైకెత్తేసరికి గోడగడియారం మూడు చూపిస్తోంది. ఎదురుగా వెలగని రంగులబల్బు తోరణమూ, పెద్ద గంగా ళంలో ఓ పక్కగా ఉంచిన నానబెట్టిన సెనగలూ, రెండు అరటిపళ్ళ గెలలూ, తమలపాకుల మోతలూ ఇతర సరం జామా తనని వెక్కిరించినట్టయింది. ఎలాంటి చిక్కు సమస్య వచ్చినా ఏదో ఉపాయం చూపించే రేవతితో టెలి ఫోన్‌లో మాట్లాడే అవకాశం లేదు. ఎంత దబ్బిస్తామన్నా, వీధులన్నీ జలమయం అయాయి గనక, రేవతియింటికి కబురు తీసికెళ్ళడానికి, ఏ ప్యూనూ ఒడంబడ లేదు. 'అయ్యగారు వచ్చాక చెప్పి చివాట్లు పెట్టిస్తానని' బెదిరించినా 'అమ్మా! మహా అయితే ఉద్యోగం కదా పీకేస్తారు. కాని య్యండి. అందుకని గంగలో దిగి ప్రాణాలు తీసుకోలేంగదా. మా ఆడాళ్ళూ పిల్లలూ ఎలాఉన్నారో వెళ్ళి కనుక్కుం దామన్నా అవకాశం లేదు. అంతకన్న ముఖ్యం కాదుకదా మీ కబురు!' అన్నంత వరకు వెళ్ళారు పరివారజనం.

అనూరాధ నవ్వుకుంది. 'మూర్ఖపు ప్రజ. ఈ శరీరం శాశ్వతం అనుకుం టారు. కూడో గుడ్డో కొంపో అని ఏడు స్తారు. ఎంతకన్న ఏది ముఖ్యమో విశ్వ బతుకులెప్పుడూ ఒకలాగే అఘోరిస్తు న్నాయి.'

ఎప్పుడూ ఎరగని అసహాయస్థితిలో అవిడ అల్లల్లాడిపోయింది. ఆ వరలక్ష్మి విగ్రహాన్ని చూస్తూంటే 'అయ్యో తల్లీ, ఈపాటికి హాలు నిండిపోయేది. పాపిష్టి దాన్ని. ఊరంతా పిలుచుకు వచ్చాను. నేనేం చెయ్యను? నీ ప్రసాదాన్ని వాయి నాల రూపంలో నీ భక్తులకి ఎలా పంచి పెట్టను.... వాళ్ళెవరూ అడుగుపెట్టడానికి వీల్లేకుండా వీధులన్నీ జలమయంచేశావు. పోనీ నేనే వెడదామంటే దారీతెన్నూ కనపడదు. సమస్త స్త్రీల సౌభాగ్య ఐశ్వ ర్యాలూ నీ వ్రతనిర్వహణలో ఇముడ్చు



కున్నావు. ఈ దుఃఖసముద్రంలోంచి నన్నెలా దాటిస్తావో' అని కళ్లుమూసుకుని లక్ష్మీ సహస్రనామం జపిస్తూ అలా ఎంతసేపు ఉండిపోయిందో పెదవులు ఎండిపోయాయి. నీటితో కనుగొలకులు నిండిపోయాయి.

'ఇదేమిటి వదినగారూ, అలా దిగులుపడి కూచున్నారూ!' అనే రేవతి కేకతో ఉలికిపడి యీ లోకంలోకి వచ్చింది. కలో నిజమో ఆవిడకి ఓ పట్టాన బోధపడలేదు. ఓ చేతిలో గొడుగు, ఓ చేత్తో అరగజం పొడుగున్న బాటరీలైటు. కట్టుకున్న కొత్త పట్టుచీర ముడుకులదాకా తడిసిన గుర్తుతో, ఎదురుగా రేవతి!

'ఏదైనా ఆపద వచ్చినపుడు ధైర్యంగా ఎదుర్కొంటాంగాని అలా వర్రీఅయి కూచుంటామా వదినగారూ! ఇంకా అలా తెల్లబోయి చూస్తారేమిటి? ఇవిగో ప్లాస్టిక్ సంచీలు, అరడజను సంపాదించి తెచ్చాను. మూడు మీకూ, మూడు నాకూ. శెనగలూ పళ్లూ తమలపాకులూ పసుపూ కుంకుమా గబగబా సర్దండి. మన తప్పు లేకుండా పిల్చాంగాని వాళ్లకి వచ్చే అవకాశం లేక ఊరూవాడా నీటిలో మునిగిపోతే మనమేం చేస్తాం! అలాగని మధ్యలో పాడుచేసుకుని ప్రతిఫలం దక్కకుండా చేసుకుంటామా! ఆపద్ధర్మంగా ముగ్గురేసి ముత్తైదులకి వాయినాలు యిచ్చుకుని వద్దాం.... లేవండి ఇంకాచూస్తారేం, గబగబా పట్టుచీర కట్టుకురండి. భక్తులకి పరీక్షలు ఎప్పుడు తప్పేయి గనుక?'

గట్టిగా గడగడా రేవతి వల్లించినా కూడా అనూరాధ ఆశ్చర్యం అణగలేదు. ఈవిడ ఎలా వచ్చింది? ఇలాంటి పరిస్థితిలో తాము బయటకు వెళ్లేదెలా! తనని తరింపజేయడానికి వరలక్ష్మే ఈ రూపంలో రాలేదు గదా!

రేవతి అట్టే ఆలశ్యం చెయ్యకుండా జరిగింది చెప్పింది. పల్లపు ప్రాంతాల్లో వరదనీటిలో చిక్కుకుపోయిన వారిని సురక్షిత ప్రాంతాల్లో చేర్చడానికి అప్పుడే ఆరు పడవలు ఊళ్లోకి వచ్చి తిరుగుతున్నాయిట. ఎవరి పనులు వారికి అతి ముఖ్యంగా కనిపించడంలో ఆశ్చర్యం లేదు కదా.... 'ప్రభుత్వం పంపిన పడవలు, యుద్ధ ప్రాతిపదిక మీద ప్రాణాల్ని రక్షించడమే వీటి కర్తవ్యం' అని మొండికెత్తి, ఎంత ప్రయత్నించినా పొద్దుట్నుంచీ రేవతి, ఓ అరగంటసేపు పడవని బుక్ చేద్దామంటే, కుదిరింది కాదుట. అయినా ఉద్యమం అంటూ మొదలుపెట్టకూడదేగాని తీరా ఉద్యాపన చెయ్యకుండా వదలుతే వ్రతం, అసలే అత్యంత శక్తిస్వరూపిణి కదా వరలక్ష్మి, బెడిసిగొట్టి ఈ దేశమే ఏకంగా నామరూపాలు లేకుండాపోతే? బతకనీ చావనీ దైవకార్యమే యిది, మధ్యలో ఆపడానికి

వల్లా! ఎలాగ యింత కష్టం దాటిస్తావు తారకరామా! అని రేవతి గగ్గోలు పడుతూంటే వాళ్లింటి వీధిముందు ఏదో పెద్ద గొడవైతున్నట్టు తోచి, గొడుగు వేసుకుని డాబా ఎక్కి విందిట. ఎత్తుగా ఉన్న గుట్టమీద బంగళాలో లోపల కూచుని వీధిలోకి రాలేదుగానీ అనూరాధ, ఇళ్ల అరుగులదాకా ఎప్పుడో నీరు వచ్చేసిందిట. ఇప్పుడు ఆ ఊళ్లో ఉన్నవి వీధులు కావు, నిండు నీటి కాలవలు. బళ్లు ఓడలై చాలా సేపయిందిట ఆ ఊళ్లో.

'మా వీధివైపు ఏదో గొడవైందన్నాను కాదు వదినగారూ! మనుష్యుల్ని సురక్షిత ప్రాంతాలకి చేర్చి ఖాళీగా వస్తున్న ఓ పడవని మా యింటి ప్రాంతాల్లో ఆపేశారు, మన ఎమ్మెల్యే, ఆయన పి.ఏ. ఫొటోగ్రాఫరూ. 'ఎంత, ఓ గంటలో తిరిగి వచ్చేస్తాం. వరద ప్రాంతాన్ని ప్రాణాలకి తెగించి దర్శించి వస్తున్న ప్రజాసేవకుడు' అని రెండే రెండు ఫొటోలు తీయించుకున్న మీ పడవ మీకు అరిచేతులో పెట్టుకు అప్పచెబుతాం' అని ఎమ్మెల్యే ఎంత బతిమాలినా కార్యకర్త ఒప్పుకోలేదుట. ఆఖరికి 'నా పడవికి ఎసరు పెట్టకండయ్యా! మీ అబ్బాయికి ఉద్యోగం వేయించే పూచీ నాదిగా!' అంటూ మరి ఎలా నచ్చచెప్పాడో నడిపే వాడితోసహా పడవ లంకించుకున్నాడు. ఆ ఎమ్మెల్యే మా దూరపు బంధువు. లోపలికి పిలిపించి కాఫీలూ అవీ ఇచ్చి మన కొచ్చిన కష్టం వివరిద్దామనుకున్నాను గాని నిజం చెబితే నమ్మరు కదా.... మనకి తెలిసిన ఒకరు చావుబతుకుల్లో ఉన్నారనీ ఆస్పత్రికి చేర్చాలనీ చెప్పేను. రాజకీయ నాయకుడు కదా ఓ పచ్చనోటు చేతిలో పడ్డాక కాని నమ్మలేదు. పడవ వాడికి వేరే వంద ఆశ చూపి, ఇలా తెగించి వచ్చాను వదినగారూ! నేను వచ్చింది పడవమీదే.... నా సాహసం తోనే వచ్చాననుకుంటున్నారా నేను. ఉహూ! ఆ తల్లే ఈ శక్తి ఇచ్చింది' రేవతిచే కన్నీళ్లతో కౌగిలించుకుంది అనూరాధ. గబగబా పట్టుచీర చుట్టబెట్టుకుంది. ఆరు ప్లాస్టిక్ పేకెట్లూ సరుకులతో నింపి మరి గాలి దూరకుండా సిద్ధం చేసింది. 'అవును గాని మన కిప్పుడు పేరంటాళ్లు ఎలా దొరుకుతారు వదినా, ఇలాంటప్పుడు వీధి తలుపు ఎవరు తీస్తారు, ఎలా యిస్తాం, ఎలా అందుకుంటారు?' అని అడక్కుండా ఉండలేకపోయింది. రేవతి నవ్వుతూ అంది.

'బాగుంది వదినగారూ, నారు పోసిన వాడు నీరు పొయ్యడంటారా! ఆ వరలక్ష్మిని నమ్మిన వాళ్లకి ఉపాయాలు చూపించే పూచీ కూడా ఆ తల్లిదే. మనం వెళ్లే స్థితిలో లేంగాని మన వీధి మలుపు దాటితే ఉన్నారు అరడజను మందికి తక్కువ కాకుండా పండు ముత్తైదువలు! ఆ యింటి ముందునుంచి పడవ వెడుతూంటుంది గదా, పడవవాడిచేత బలంగా ఆయా యిళ్లలోకి వాయినం పొట్లాలు విసిరిద్దాం. ఇలా వెళ్లి అలా వచ్చేద్దాం. ఇంతా చేసి మూడే మూడు ఇళ్లు కదా! ఈ ఆపదలోంచి ఇంతకంటె గట్టెక్కే ఉపాయం నాకు తోచలేదు వదినగారూ! పడవవాడు అరుస్తున్నాడు. బయల్దేరండి మరి.'

గాలికన్న నీటికన్న వార్త స్పీడు ఎక్కువేమో మరి! ఇలా వీళ్లు ఈ పని మీద బయల్దేరుతున్నారనే వార్త అంత నిముషాలమీద ఆ గుట్టమీద ఇళ్లకి ఎలా చేరిపోయిందో! డాబాలూ, చెట్లూ, గోడలూ గొడుగులు పట్టుకున్న మనుషులతో నిండిపోయాయి. అన్ని వందల కళ్లకి ఆ క్షణంలో సగంసేపు కనిపించింది పడవమీద టార్చిలైటు వెలుగు మాత్రమే. సరిగ్గా అదే సమయంలో ఉన్నట్టుండి గాలీ వానా వెయ్యింతలు ఎక్కువయాయా అనిపించేటట్లు విజృంభించాయి.

ఆ ప్రవాహంలో ఆ పడవ ఎత్తు నుంచి ఒక్కసారిగా ఆ వీధి చివరి పల్లానికి జారింది.

నిత్యప్రసాద సేవనంవల్ల పునీతలే కాక పూర్ణకుంభ సమానులయిన ఆ పుణ్యాంగన లిద్దరూ చిన్న సిమెంటు బస్తాల్లాంటి ఆరేసి ప్యాకెట్లతో మీదకి ఒరగడంతో, పడవ పక్కవీధికి మలుపు తిరగడంలో, పడవ ఒరిగి, తెడ్డు పడవ వాడి పట్టుతప్పి, వాడు పైకి బలంగా గెంతడంతో 'ఏం జరగాలనుందో అదే జరిగింది.'

ఈత నేర్చిన పడవవాడు వాడికి తెలిసింది ఈ జీవితమే గనక, ఎలాగో బతికి బయటపడ్డాడు. వాళ్లిద్దరూ మాత్రం తలమునకై పరవశలై సముద్రరాజ తనయకి సమీపమార్గంలోనే ఉన్నారు!